# చిన్న పరిశ్రమలు - పెద్ద కథలు

డాక్టర్ సోమరాజు సుశీల

"ఈవేళ మంచి రోజేనా?"

"ఏ సరిహద్దులో అల్లర్లు జరుగుతున్నాయి? మంచి పని చెయ్యాలంటే అన్ని రోజులూ మంచివే. నీ లెక్కలో మంచి రోజునే పని చెయ్యాలంటే నీకు వారంలో ఆరు రోజులూ రెస్టే."

"పోన్లెండి! మరీ మంచిది. ఆ మంచి రోజు కాస్తా ఆదివారం అయితే నేను హాయిగా పూర్తి విశ్రాంతి తీసుకోవచ్చు! అయినా అడిగిన దానికి ఎదురు ప్రశ్నలేయకుండా సమాధానం చెప్పలేరా?"

"పూర్తి ఇన్ఫర్మేషన్ లేకుండా సలహాలిస్తే నీకు డొంక దారే! ఇంతకీ ఏవిటి పని?"

"నేను మన బాంకు హెడ్డాఫీసు కెళ్ళాలి. మనం అడిగిన లోన్ ప్రపోజలు పైకి పంపారట. కాస్త మంచి టైము చూసుకుని వెడితే ఆ ఆఫీసరు పెద్దమనిషి ఏ బోర్డు మీటింగుకో వెళ్ళకుండా సీట్లో వుంటాడు. మనకి లోను వచ్చేదో చచ్చేదో ఈ వేళే తేలిపోతుంది. ఎనిమిది నెలల తపస్సుకి ఒక ఫలితం కన్పిస్తుంది."

"తొమ్మిది సంఖ్య అయితే బాగుండేది. అయినా వీళ్ళు పంపారా? పంపుతున్నామన్నారా? రెంటికీ చాలా తేడావుంది."

"నాతో అయితే పంపామనే చెప్పారు. కానీ నిన్న రాజు బాంకి కెడితే తయారవుతోంది, పంపేస్తామన్నారట."

"సరిగ్గా కనుక్కుని వెళ్ళు! నీ కసలే బీపీ. ఎండ లెక్కువవుతున్నాయి. ఆపై బాంకుతో వ్యవహారం. జాగర్త!"

"ఎందుకన్ని జాగ్రత్తలు చెబుతారు? నేనేదో యుద్ధాని కెడుతున్నట్లు! నాకేమైనా అందరితో గొడవలు పెట్టుకోవడం సరదానా? అర్థం పర్థం లేకుండా వాళ్ళు మాట్లాడితే నేను మాత్రం ఎంతకాలం మంచిగా నిమ్మళంగా ఉండాలి? రెడ్డొచ్చె మొదలాడరా అన్నట్లుగా మరి వాళ్ళకి చెప్పిందే చెప్పి అడిగిందే అడిగి వున్న మతి కాస్తా పోతోంది. మళ్ళీ నాకు వున్న మతి పోతే వాళ్ళకేగా నష్టం! అయినా నేనెటూ బ్రాంచికి వెళ్లాలి. కనుక్కుంటా లెండి. నిన్న ఒక లక్షకి బాంకు గ్యారంటీ ఇవ్వాలని టెలిగ్రాం వచ్చింది. సోమవారం నాటికి వాళ్ళకందాలట. కాబట్టి ఆ పని అయ్యాకే నేను హెడ్డాఫీసు కెళ్ళేది!"

ముందు బ్రాంచి కెళ్ళాలని తయారవుతున్నా! అంటే- మాకు తమరు శాంక్షను చేసిన లిమిట్స్‌లో పని చేయాలంటే ప్రాణం మీదకొస్తోంది! మా ఎఫిషియెన్సీ లెవలు నలభై శాతం కూడా రావటం లేదు. కాస్త పెంచండి పెద్దలారా అని ఆరుసార్లుగా మేం చేసుకున్న విన్నపాల నిజ ప్రతులూ, అనుకున్న ప్రకారం అందుకోలేక పోయిన టర్నోవర్ల వివరాలూ, దానికి మేమిచ్చుకున్న వినయ పూర్వక క్షమాపణ సమాధానాలూ, మేం తెచ్చుకోబోయే ఆర్డర్ని సజావుగా చేస్తే మా యూనిట్టు గడించబోయే లాభాల ఊహా గణితాలూ, వగైరాలన్నీ సర్దుకునే సరికి పన్నెండయింది. అయిన ఆలస్యం ఎలాగూ అయిందీ! భోజనం చేసేసి బయల్దేరితే నీరసమూ ఆవేశమూ రెండూ కంట్రోల్లో వుంటాయని ఆ పని కూడా కానిచ్చేశా!

"రాజూ! గోవిందుని కారు తీయమని చెప్పు!"

"ఆరు లంచ్ చేత్తన్నారండి!"

వెళ్ళబోయే పని రిజల్టు ఇక్కడే తెలిసి పోతోంది. "రాజూ నువ్వు మన బ్రాంచికెళ్ళి అక్కడే వుండు. నే వెనకాలే వస్తా. గోల్డులోను ఆఫీసరుగారు వచ్చారో లేదో చూడు!"

"అమ్మా! మీరొచ్చేలోపల మనం రాసుంచుకున్న ఉత్తరంగానీ మన ఫీల్డాఫీసరు గారికిచ్చేనామ్మా?"

"అలాటి ఉపకారాలేవీ నువ్వు చెయ్యక్కర లేదుగానీ మన ఎకౌంటు పొజిషన్ మాత్రం కౌంటర్లో చూసి అక్కడే ఉండు. ఆఫీసరు గారికి కనపడొద్దసలు, విషయం ఎత్తకు!" రాజెళ్ళి పోయాడు.

మా డ్రైవరుగారి భోజనం అయి నేను బ్రాంచి చేరుకునేటప్పటికి ఒంటి గంటయింది.

మా ఆఫీసరు గారు కంప్యూటరు ముందు కూచుని ఏదో దీర్ఘాలోచనలో వున్నారు. ఎవరి కొంప మునుగుతోందో!




## అత్తకి జేజే

"ఎంతో మంచి అమ్మల్ని- ఇంకా ఎంతో మంచి అత్తగార్లుగా తీర్చి దిద్దేందుకు ఏదైనా ఓ కోచింగ్ సెంటరు పెట్టరాదూ" అంటే "అదెంత భాగ్యం! మంచి రోజు చూద్దాం పట్టు" అని తెలుగు కాలెండరుతో ప్రత్యక్షమయ్యే ఎవ్రెడీ బాటరీ లాటి అందరికీ బామ్మ మా ఇద్దరికీ మాత్రమే అమ్మ అయిన గంగిగోవు లాటి నా అత్తగారు సోమరాజు విజయలక్ష్మి గారికి మా కథలన్నీ అచ్చంగా...

ప్రేమతో సుశీల

(నా తప్పలన్నీ ఈ దండంతో సరి! సరేనా...? సరే అనాలి... అన్నారు... అమ్మయ్య.)

# బాదం హల్వా!



"ఏంటి మేడమ్? మీరొచ్చారు? రాజు రాలేదా?"

"అతనూ వచ్చాడు. నిన్ననే టెలిగ్రాం వచ్చింది సోమవారం లోపల లక్షకి బాంక్ గారంటీ కట్టాలని. మీకు తెలుసుగా మాదే లోయస్ట్ టెండరు. బాంక్ గారంటీల కన్నిటికీ 25 శాతం మార్జిను కట్టాలిగా. మాకేమో డ్రాయింగు పవరు ఏడువేలే వుంది. అందుకని కొద్దిగా గోల్డు తెచ్చా. దాని మీద 25,000 లోనిచ్చి అది మార్జినుగా పెట్టుకుని గారంటీ ఇవ్వమని అడుగుదామని వచ్చా! రేపటికైనా గారంటీ రిలీజైతే స్పీడ్ పోస్ట్‌లో పంపిస్తాం!"


"ఇంత పని ఒక్క రోజులో అవడం కష్టం మేడమ్. పైగా గోల్డులోను టైమైపోయింది. ఉండండి. సి.ఎమ్.గారిని అడిగి వస్తా."

పావుగంటకి బయటకి వచ్చారు. అటెటో చూస్తూ నాకు చెప్పాడు. "మీకు బాంక్ గారంటీ లిమిటెవ్వడూ శాంక్షనవ లేదుట గదా! అందు కని లక్షకి గారంటీ మే మివ్వాలంటే మీరు లక్ష డిపాజిట్ చెయ్యాలంటున్నారు మా చీఫ్ మేనేజరు గారు." మళ్ళీ కంప్యూటర్ తపస్సులో పడ్డారు.

చేతనయినంతగా నవ్వు మొఖం పెట్టుకుని ఆయన రూమ్‌లోకి గేట్ క్రాష్ చేశా. కార్డు పంపితే పనవదని నాకు తెలుసు. మా సి.ఎం. గారు ఆరుగురు పెద్ద కస్టమర్సుతో అంతులేని డిస్కషన్‌లో వున్నారు. వాళ్ళ ఫీల్డాఫీసరు గారు పక్కసీట్లో సోఫాలో వివరాల దస్త్రంలో గురువు గారి పెద్ద శిష్యుడంత వినయంగా ఆనందంగా తయారుగా వున్నాడు.

"క్షమించాలి సార్! మీరు చాలా ముఖ్యమైన మీటింగులో వున్నారు. కానీ డిస్టర్బ్ చేయక తప్పట్లేదు. నా కంగారులో నేనే మైనా ఎక్కువ మాట్లాడితే తప్పట్టుకోకండి.

లక్ష కడితేగాని గారంటీ ఇవ్వడం కుద రదన్నారట. మామూలుగా మమ్మల్నెవుడూ డిపార్టుమెంటు వాళ్ళు గారంటీ ఇవ్వమని అడగలేదు. కానీ ఈసారి మా అదృష్టమో దురదృష్టమో ఆర్డరు విలువ మా తాహతుకి మించినదనీ వాళ్లు భావిస్తున్నారు. గారంటీ ఇవ్వకపోతే అందరం ఇబ్బందిలో పడిపోతాం. ఇదుగో టెలిగ్రాం చూడండి" – టెలిగ్రాం చూశాక ఆయన మొఖంలో కాస్త చలనం కని పించింది. అవును మరి ఈ ఆర్డరు మిస్సయితే వాళ్లు మునిగేది ఖాయం. నాకైతే పెద్దతేడా




వడదు.

"డాక్టరుగారూ! మీరు మాత్రం మా కెప్పటి కప్పుడు అగ్ని పరీక్షలు పెట్టేస్తారు! మా రూల్సు మాకుంటాయని మిమ్మల్ని ఇన్నేళ్ళుగా నమ్మించ లేక పోయాం! లిమిట్ శాంక్షను కాకుండా మీకు గారంటీ ఇవ్వలేం. కాకపోతే ఒక విధంగా చేద్దాం. మీ పి.పి. ఎకౌంటులో లక్ష విత్ డ్రాయల్ ఎక్సెస్ చేసి అది డిపాజిట్‌గా తీసుకుని దాని మీద మీకు గారంటీ ఇస్తాం!"

"మీకు నా మీదున్న నమ్మకానికి జోహార్లు సార్! ఇదే నేనే బంగ్లాదేశ్‌లోనో రెండేళ్లుండి ఎన్.ఆర్.ఐ.గా వస్తే ఐదువేలు కడితేనే గారంటీ ఇచ్చుండే వాళ్ళు. మళ్ళీ నా ఎకౌంటు రెగ్యులర్‌గా లేదని అనకండి."

"లిమిట్ శాంక్షన్ అయ్యాక మీ ఎకౌంట్‌లో రివర్సు చేస్తాంలెండి మేడం!"– ఒక్కటి మాత్రం ఒప్పుకుని తీరాలి. మా బ్యాంకు వాళ్లు నేను అడిగిన నేపి ఇవ్వరు గానీ నా వయసు చూసి జాలో, చదువుచూసి గౌరవమో, నోరు చూసి భయమోగాని చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు!

"సర్లెండి! ఏదో చచ్చినాడి పెళ్ళికి వచ్చిందే కట్నం. సార్ మరి నా ప్రపోజలు..."

"అదెవుడో పంపేశాంగా..."

"ఎన్నడిగితే తయారవుతోందని అన్నారు?"

"అంటే ఎవ్వడో అంటే పొద్దున డాక్‌లో పెళ్ళింది. మీరక్కడ ప్రయత్నం చేసుకోండి. మీకు అందరూ బాగా తెలుసు కదా!"

ముంచాడు కొంప! అంటే ఈయన సరిగా రాయలేదన్నట్లేగా!

"రికమెండ్ చేశారా సార్? అక్కడ ఎవర్ని కలవాలి?"

"ఎటూ వెడుతున్నారుగా! మీకే తెలుస్తుంది. అక్కడ మన బ్రాంచ్ పనులన్నీ విష్ణుశర్మగారు చూస్తుంటారు!"

సరేనని బయల్దేరా. అదేవిటి? వెడితే తెలుస్తుందంటారు? కొంపదీసి రికమెండ్ చేయలేదా ఏమిటి? అలాటప్పుడు ఈ హెడ్డాఫీసుకి పంపే డ్రామా దేనికి? బహుశా నేను మళ్ళీ ఏ బ్రహ్మదేవుడి కాళ్ళో పట్టుకుని అజ కనుక్కోమంటే వీళ్ళకి మాట రాకుండా వుండటానికి కాబోలు. పిక్నిక్కుల్లో అందరం గుండ్రంగా కూచుని బంతి పాస్ చేస్తామే అలాగన్నమాట. మ్యూజిక్ ఆగేటప్పటికి ఎవరి చేతిలో బంతుంటే వాళ్లే దొంగ!

ఈ బాంకు వాళ్లు మమ్మల్ని నమ్మో నమ్మకో ఇంత డబ్బిచ్చారు కదా. కనీసం ఎలా రాబట్టుకోవాలీ అన్న ఆలోచనే ఉండదా ఏవిటి? పిడుక్కీ బియ్యానికీ ఒకటే రూలు. (పరిస్థితులను బట్టి రూల్సుండాలిగాని, రూల్సున్నాయి కదా అని వాటికి తగ్గట్టుగా ప్రాబ్లెమ్స్ ఉంటాయా ఏవిటి? రూల్సున్నది పనులు సజావుగా అవడానికా? అనవసరంగా ఆగడానికా? అంత అన్నిటికీ అడ్డం వచ్చే రూల్సు పెట్టుకుని మాలాంటి వాళ్ళని ఇండస్ట్రీలు పెట్టమని ఎడ్వర్టైజ్‌మెంట్లివ్వడం ఎందుకు?)

అంతగా రూల్సు అడ్డం రావడానికి వీలవక పోతే వీళ్ళకి సవర్సుండవు. నెలకి ముప్ఫయ్ వేలు జీతం పుచ్చుకుంటున్న మేనేజరు గారికి, పాతికేళ్ళనుంచీ వీళ్లతోనే ఎకౌంటున్న యూనిట్‌కి గారంటీ ఇవ్వడానికి పవర్సు లేవంటే నమ్మేందుకు నేనేమన్నా చిన్న పిల్లనా! వీళ్ల సర్వీసు కన్నా నా ఎకౌంటు వయస్సే ఎక్కువ. ఈ మేనేజర్లకేముంది! వస్తుంటారు పోతుంటారు! కలకాలం వుండాల్సింది మా యూనిట్సు మళ్ళీ సదా మా సేవలో బాంకూనూ. ఉన్నదున్నట్లు అడుగుతానని అందరికీ నా మీద కోపమే. మా కష్టార్జితం వడ్డీ రూపంలో పుచ్చుకుని వీళ్ళే ఇంత షోకు వెలగబెడితే ఇంక మాకెంత వుండాలి? ఏమిటో ప్రపంచం అంతా తల్లకిందులుగా నడుస్తుందని బ్రహ్మం గారేనాడో చెప్పారు.

గడచిన నాలుగేళ్ళూ మా యూనిట్ మూసెయ్యకుండా ప్రాణాలతో నిలబెట్టడానికి లిటరల్‌గా అష్టకష్టాలు పడ్డాను. ఈత రాకుండా చెరువులో దూకినట్లు ఏ ప్రిపరేషనూ లేకుండా సడెన్‌గా లిబరలైజేషను అమలులో కొచ్చేసి జనాలంతా హైటెక్, హై క్వాలిటీ, ఎక్స్‌పోర్ట్సు, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్సు, ఐ.ఎస్.ఒ.9000లు, ఇంటర్నేషనల్ మార్కెట్స్, టెక్నాలజీ అప్‌గ్రెడేషన్ అని కల్లు తాగిన కోతుల్లా గెంతడంతో మాకు పెద్ద దెబ్బ తగిలింది. ఆ ఆటుపోట్లన్నీ తట్టుకునే టప్పటికి యూనిట్టూ, నేనూ, మా ఉత్సాహం తప్ప ఏం మిగల్లేదు. మళ్ళీ నిరుటి నించి నార్మల్‌కి వచ్చి పని చేసుకుందా మను కుంటే డబ్బులు చాలట్లేదు. అప్లికేషను పెట్టి ఎనిమిది నెలలయ్యాక ఇదిగో ఇప్పుడు రికమెండ్ చేసో చెయ్యకో పైకి పంపార్ట.

పైకంటే నిజంగా పైకే సుమా! మా ఫైలు చూసే విష్ణుశర్మగారు ఆ లక్ష్మీ నిలయం ఆరో అంతస్థులో ఉంటారుట. భారత దేశపు లక్ష్మీ నిలయం కళకళ్లాడి పోతోంది. అక్కడ పనిచేసే వాచ్‌మన్ మొదలుకొని పెద్ద మేనేజరుదాకా అంతా మేం దేవ దూతలం అన్నంత హుందాగా ధైర్యంగా తిరుగుతున్నారు. చీకూ చింతా లేనట్లుండే వాళ్ళని చూస్తే ఒక్క క్షణం నాకెంతో అసూయ అనిపించింది. ఎవ్వరూ ఏ.సి.గదుల్లో ఉంటారేమో అందరూ మంచి నీటుగా స్టైలుగా వున్నారు. చివరికి వాళ్ళ కార్లు కూడా వర్క్ టు రూల్ లాగా పొద్దున్నే

రావడం సాయంత్రం ఇంటి కెళ్ళడం వల్ల తళతళ్ళాడుతూ ఉన్నాయి. పాపం మా పిచ్చి కార్లలాగా వర్కుషాపులకీ, స్టోరులకీ, అఫ్జల్ గంజికీ, ట్రాన్స్ పోర్టు ఆఫీసులకీ పటం చెర్వు మంచి కుషాయి గూడాకీ పరుగులు తియ్యవుగా! నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని ఆ లక్ష్మీ నిలయం ఆరో అంతస్థులో అడుగు పెట్టా లిఫ్టు సాయంతో. ఆ లిఫ్టు కూడా బిల్డింగుకు తగ్గట్టు విశాలంగా ఒక గుమాస్తా ఇద్దరు పిల్లలతో నివసించడానికి సరిపడే ఠికానా అంత వుంది. లిఫ్టులోంచి హాలు లోకి వెళ్ళేటప్పటికి చల్లగాలికి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

ఆ హాలులో వున్న ఆఫీసర్లంతా చాలా సీనియర్లలాగా రేపో మాపో అన్నట్టున్నారు. అంటే ఆరో అంతస్థులో హాలు సీటు దొరకాలన్నా తల నెరవాలన్న మాట. అటు ఇటు తిరిగే ఒకళ్ళిద్దరు తప్పించి అలికిడేమీ లేదు. అంతా చాలా స్థిమితంగా విశ్రాంతిగా నిర్వికార సమాధిలో వున్నట్లుగా ఫైల్సు తిరగేస్తున్నారు. వీళ్ళందరికీ అడిగిన దాంట్లో సగం అప్పిచ్చి తలా ఒక చిన్న యూనిట్టు పెట్టించేస్తే ఎంత మజాగా వుంటుందో! ఛ తప్పకదూ. ముఖ్యమైన పని మీద వచ్చి ఇలాంటి వికటపు ఆలోచనలు చేయవచ్చునా? చాలా అయోమయంగా, విస్పహోయంగా చూస్తూ నెమ్మదిగా అడిగా. "సార్! విష్ణుశర్మ గారెక్కడుంటారు?"

"స్ట్రెయిట్‌గా వెళ్ళి లెఫ్ట్‌కి తిరిగితే కార్నర్ సీటమ్మా"

"నమస్కారం సార్! ఇందాక ఫోన్లో మాట్లాడా మీతో!"

"కూచోండి! మీ వర్కింగ్ కాపిటల్ ఎన్‌హాన్స్‌మెంట్ గురించి కదా? కానీ మీ ప్రపోజలు వచ్చినట్లు లేదే?"

"పంపామన్నారండీ! కనుక్కునే వచ్చా. ఇంకెవరి దగ్గరయినా వుందేమో."

"మూర్తి గారూ! బ్రాంచి నించి మనకి వీరి ప్రపోజలేమయినా వచ్చిందా?"

"వచ్చింది సార్! కానీ... అమ్మా మీ యూనిట్ కొన్నాళ్ళు ఎన్.పి.ఎ.గా వుందా?"

"అంటే..."

"నాన్ పెర్‌ఫామింగ్ ఎసెట్."

"అంటే...!"

"అంటే బాంకులో డిపాజిట్లు గానీ విత్‌డ్రాయిల్సుగానీ ఏవీ లేకుండా ట్రాన్సాక్షన్సేవీ లేకపోవడం అన్నమాట. మీ యూనిట్టేమయినా కొన్నాళ్ళు సిక్ అయిందా?"

"కొంత సిక్కేమిటి సార్! ఆల్‌మోస్ట్ చచ్చి బతికాం. మా చావు మేం చస్తుంటే ఎకౌంటులో డిపాజిట్లు ఎలా వుంటాయండి. విత్ డ్రాయల్ మీరొప్పుకుంటే ట్రాన్సాక్షన్సుండేవి మరి! కానీ మాకంత ఆపద వచ్చినా కూడా మీ బాంకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదండీ!"

"మీరడిగారా?"

"అంటే అప్పట్లో చాలా ప్రాబ్లెమ్సుండడంతో బాంకుని అప్పడిగి తిరగడానికి వీలు పడలేదండీ. ఆ తిరగడంలో నాకున్న ధైర్యం పోయి మంచం పట్టేస్తానేమోనని భయం వేసి మా వూళ్ళో మాకున్న ఎనిమిదెకరాలూ, ఇక్కడొక ఫ్లాట్ అమ్మేసి రెండు సంవత్సరాలు యూనిట్ నడిపామండీ. భగవంతుడి దయ వల్ల ఇప్పుడా సమస్యలన్నీ తీరి మంచి ఆర్డర్లున్నాయండీ. ఇప్పుడు కొత్త డిస్ట్రిబ్యూటరు దొరికి మాకు మళ్ళీ మంచి రోజులొచ్చాయి కదా! మీరడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పగల్గుతామనుకుని లోను కప్లై చేశాను. సుమారు ఎనిమిది నెలల నించీ అడుగుతున్నాం. ఈవేళ మేనేజరు గార్ని కలిస్తే మీకు పంపామని చెప్పారు!"


"పంపారుగానీ పెద్దగా రికమెండ్ చేయలేదమ్మా. గడచిన మూడేళ్ళుగా మీ పెర్‌ఫామెన్స్ బాగుండ లేదని రాస్తున్నారు. ఏదైనా ఎడిషనల్ కొల్లేటరల్ సెక్యూరిటీ ఇస్తే ఇవ్వవచ్చని రాశారు. డెసిషన్ మాకు వదలి పెట్టారు."

"ఏదో సామెత చెప్పినట్లు పెళ్ళి అయితేగాని పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరితేగాని పెళ్ళవదు అన్నట్లుంది. నేను ఐదు పేజీల అప్లికేషన్లోనే సవివరంగా మా యూనిట్ ఎదుర్కొన్న పరిస్థితులన్నీ రాశా. మేం రాసిన కారణాలే మాకు చూపిస్తే ఎలా సార్! కొల్లేటరల్ అడుగుతారు, అన్నీ అక్షను చేసి రాబట్టుకోవాలనేదే మీ రూలా సార్! యాభై లక్షలు ఖరీదు చేసే మా బిల్డింగు మీ తనఖాలోనే వుంటే ఒక్క ఐదు లక్షలడిగితే ఇంకొక ఆస్థి ఎక్కడినుంచి తేగలం."

"మా రూల్సలా వున్నాయి. పది లక్షల లోనుకి మీరు యాభై లక్షల టర్నోవరు చేయాలి. కానీ నిరుడు మార్చినాటికి 35 కూడా దాటలేదు."

"మీ బాంకు వాళ్ళు గైడ్‌లైన్స్ అన్నిటికీ విపరీత భాష్యాలు చెప్తారండీ. చేసే టర్నోవరుకి కనీసం 20 శాతం బాంకు ఇవ్వాలని అన్నారుగానీ, మీ రూల్ లాగా అనలేదే. ప్రొడక్షుని బట్టీ, ఇచ్చే క్రెడిట్‌ని బట్టీ, సీజన్‌ని బట్టీ డబ్బు పెట్టుబడి పెట్టాలి గానీ పర్సంటేజీ ప్రకారం బిజినెస్ ఎలా అవుతుంది సార్? అందులోనూ మాలాంటి చిన్న వాళ్ళకి బజార్లో క్రెడిట్ దొరకదు. ఆర్నెల్ల లోను పేమెంట్ రాదు. ఐదింతలు టర్నోవరు ఏ సొమ్ము తెచ్చి చెయ్యాలి? అయినా ఈసారి మాకు మొదటి ఆరు నెలలకే నలభై లక్షలయింది కదా!"

"కానీ మేమెప్పుడూ గడచిన మూడేళ్ళ ఏవరేజ్



తీసుకుంటాం."

"ఒక గ్రాఫ్ ప్రకారం పెరగడానికి మావేమీ పెద్ద యూనిట్లు కావు కదండీ. ఈ ఏడాది బాగుంది కదా అని మళ్ళీ అలా వుంటుందని చెప్పలేం. ఇప్పుడు బాలేక పోతే రేపు బాగుండదని చెప్పలేం. ఎప్పటి కథ అప్పుడే. ఈ మూడేళ్ళ లెక్క ఏమిటి? మేం మీ బాంకులో 25 ఏళ్ళ నించీ వున్నాం కదా! ఆ లెఖ్ఖ ఎందుకు తీసుకోరు?"

"మీ బ్రాంచి రికమెండ్ చేసుంటే మేం తప్పక మీకు సహాయం చేసుండే వాళ్ళం."

"మరి మీకెందుకు పంపినట్లు?"

"అంటే సెక్యూరిటీ క్లాజు మేమే మయినా తగ్గిస్తామని అయి వుండవచ్చు. కానీ బ్రాంచి అలా రాశాక మాకు అంతా డిస్క్రిషను లేదు. ఈ ఏడాదిలా జరగనీయండి. మళ్ళీ సంవత్సరం చూద్దాం!"

"పోనీలెండి సార్! మీరంత పవర్‌లెస్ అయితే ఏం చేస్తాం. అత్తగారనేదిట 'వచ్చే ఏడాది వఙ్ఙట్లు వండి పెడతానని.' అలా వుంది."

ఇంతలోకే ఒకాయన హడావిడిగా పెద్ద బాదాం హనీ పాకెట్ ఓపెన్ చేసి అన్ని టేబిల్స్ దగ్గిరా హల్వా పంచుతున్నాడు. ఎదురుగా ఉన్నాం కదా అని నాకూ ఓ పీస్ ఇచ్చాడు.

"ఏమిటి సెలబ్రేషన్ సార్?"

విష్ణుశర్మ గారు మహదానందంగా చెప్పారు. "వీరు ఎన్.ఆర్.ఐ. అమ్మా. పటాం చెర్వులో ఐదు కోట్ల పెట్టుబడితో పెద్ద ఫ్యాక్టరీ పెడుతున్నారు. మన దేశంలో మొట్ట మొదటిసారి ఆ మందు తయారు చేస్తారు. అంతా ఎక్స్‌పోర్టే. వీరు గడిచిన 20 సంవత్సరాల నుంచీ అమెరికాలో పెద్ద కంపెనీలో పని చేసి వచ్చారు. మొత్తం మన బ్యాంకే సైన్ చేసింది! ఆర్నెల్లల్లో ప్రొడక్షన్‌కి వెళ్ళాలని ప్రయత్నం."

"చాలా సంతోషం సార్. ఆల్ ద బెస్ట్."

నవ్వుతూ అనుకున్నా - ప్రొడక్టు కొత్తది. యూనిట్ కొత్తది. ఎంట్రప్రెన్యూయర్‌కి బిజినెస్ కొత్త. దేశం కొత్త. బాంకు కొత్త. అయినా ఐదుకోట్లు ఆనందంగా ఇచ్చారు. మరి ఆయన 15 కోట్ల కొల్లేటరల్ ఇచ్చాడా? మరి మా కేసు! ప్రొడక్టు పాతది. మార్కెటు పాతది. ఎంట్రప్రెన్యూయర్ పాతది. బాంకు పాతది. అంతా పాతదే. అయినా అయిదు పైస లివ్వరు.

బాదం హల్వా అంటే మాటలా...!

---

# పిడికెడు విశ్వాసం



బాపూ!
చేయి పట్టి చేన్లోకి తీసికెళ్ళిన్నాడు
వెన్నెల మెట్లెక్కించినట్టు మురిశా
మేఘాల్ని నెత్తికెత్తుకున్నట్టు కదిలే
పత్తి చెట్లని చూసి
ఇంతలేసి కళ్ళతో వింత అనుమానాలు మోశా
పత్తి పూలకి రంగెలా వొస్తందంటే
చినుకులే చిత్ర వర్ణాలిస్తాయన్నావు
నిజమే నాకూ గుర్తే
కార్తికి ముందు ఆకాశం కేసి చూస్తూ
కరిమబ్బులకి కొంగ రాయబారం
పెట్టానంటివి కదా
చినుకూ వచ్చె
చిగురూ వచ్చె
మొగ్గ విచ్చి పువు వచ్చె
దిక్కుమాలిన పురుగెక్కణ్ణించి వచ్చిందో
పుట్టెడు దుఃఖం నింపి పోయింది
చేను దగ్గర అంతు తేలని
వింత గింజల లెక్కలైన్నాడు
వరద గూడు నీ ముఖంలో
మొదటి సారి చూశా
పంపుతో మందు కొట్టుకుంటూ..కొట్టుకుంటూ
మబ్బుల్లోకి పోయిన సూరీడిలా
పత్తి చెట్ల నడుమ నువ్వు ఆగమైపోయాక
పత్తి చెట్ల నడుమ నువ్వు ఆగమై పోయాక
గట్టుమీద నా ఒంటరితనం
నా చుట్టూ పగబట్టిన పత్తి చేను
నా అడుగులింకా నడకవ్వక ముందే
దారి ఎగుడూ దిగుడూ తెలియక ముందే
ఈ గజిబిజి దార్లో నన్నొదిలేసి ఎలా వెళ్ళావ్
నువు చూపిన పరిసరాలు తప్ప
ఆవలి గట్టు జ్ఞానం లేని వాణ్ణి
నీ నల్ల రేగడి తునకనై
కర్రు కదిలిన చాల్లో విత్తునై ఒదిగినోణ్ణి
'విషపుకాలం నాకేం తెల్సు
నువ్వు అర్ధంతర నిర్ణయమై పోయాక
బంది నొగలు మెడకెత్తుకుని నేను
నా ఎద మీద ఆరుగాలం అగ్గివుందు
ఎవుసానికి కొత్త అర్థం చెప్పి
ఫలితాన్ని నూకల్లో కాదు
రూకల్లో కొల్చుకోమనిరి
విత్తినప్పటి నుంచి గిట్టుబాటు కాంటా దాకా
మోసిన కలలన్నీ
విరిగిన మగ్గాలై, లాకౌట్ల మిల్లులై
సింథటిక్ ప్రపంచపు వెన్నుపోటుకి
చిందర వందరౌతున్న చోట
పురుగు చెట్టుకే కాదు
మొత్తం మార్కెట్టుకు పట్టుకుంది
వ్యవస్థకు పట్టుక్కుంది
మరి డెమోక్రాన్ వీళ్ళందరికీ కొట్టమంటావా?...
మట్టి పుట్టిన్నాటి చెకుముకి ఆరాటాన్ని
యుగాలు గాతల కెత్తుకుంటున్నోళ్ళం
నీ తరం నా తరానికి నాతరం ముందు తరాలకి
దారి కావాలి తప్ప
పిడికెడు విశ్వాసం కావాలి తప్ప
తిరగేసిన నాగలి కావాలి తప్ప
ఎక్స్‌గ్రేషియాలమై, సబ్సిడీలమై
సాముహికులేరుకోవడం సిగ్గుచేటు
బాపూ! ఇంక నువ్వు
అనమర్థ మరణాలకి చివరి చరణానివి
నేను ఆశావహమైన బతుక్కి
తొలి కిరణాన్ని....

—వఝల శివకుమార్



*11-6-99 * ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక